# వింతరోగం

రాజారావ్ ఆఫీస్ నించీ ఇంటికొచ్చేసరికి శారద పెరట్లో గోడ మీంచి పక్కవాటా వేపు చూస్తోంది. భార్తని చూడగానే పరుగుతోవచ్చి ఫ్లాస్కులోని 'టీ' కప్పులో పోసి అతని కందించింది.

"ఇదిగో ...మన పక్కింట్లో ఎవరో దిగారు - చూసారా?" అంది ఆనందంగా.

"ఏ పక్కింట్లో?"

"ఆదేనండి మన పక్కవాటాలోకి"

"ఓహో....అయితే నీకు కంపెనీ దొరికిందన్నమాట....!"

"ఆవిడ్ని చూస్తే బాగా కలివిడిగా వుండేట్లేవుంది. ఇంతకు ముందు పెరట్లో పని చేసుకుంటూంటే గోడమీంచీ తనని పలకరించింది. ఇంకా సేపట్లో మనతో పరిచయం చేసుకోవడాన్కి తమ భార్యాభర్తలిద్దరూ వస్తున్నామని కూడా చెప్పింది.

"ఇప్పుడా?"

"అవును."

"అలాగైతే ముందు మనం రెడిగా వుండటం మంచిది. ఇంతకూ వాళ్ళకి పిల్ల, పాపా ఎవ్వరూ లేరా?"

"ఊహూఁ .... వాళ్ల పెళ్లిమధ్యనే అయిందిట. మీరే పేపరో పుచ్చుకుని తిరగేస్తుండండి. నేనేదైనా టిఫినేర్పాటు చూస్తుంటాను....''

వంటింట్లో కెళ్ళిపోయింది శారద. ఎదురుగా టీపాయి మీదున్న ఓ వీక్లీ సందుకు నక్కడే కూలబడ్డాడు రాజారావ్.

'వాళ్లొచ్చేసరికల్లా టిఫిన్, కాఫీ సిద్ధం చెయ్యాలి' - చకచకా ఆ పన్లు పూర్తిచేసుకో సాగింది శారద. ఆమె ఆలోచన్లు మాత్రం పక్కవాటా దంపతుల చుట్టూనే తిరుగుతున్నాయ్.

ఆమెకిలాగానే అతన్లో కూడా హుషారు పాలెక్కువేనేమో! ఇహ వచ్చిరాగానే ఇద్దరూ గడగడా మాట్లాటం ప్రారంభిస్తారేమో!

హఠాత్తుగా ఆమెకి నెల్రోజుల్నాడు తామిద్దరూ కపర్ది ఇంటికెళ్ళి నప్పటి సంగతి గుర్తుకొచ్చింది.

కొత్తగా కాపురం పెట్టిన సందర్భంలో తామిద్దర్నీ వాళ్ళింటి కాహ్వానించాడు కపర్ది. కపర్ది రాజారావ్‌కున్న ముఖ్యహితుల్లో ముఖ్యుడు!

ఆరోజు తనెంతో చనువుగా ప్రవర్తించింది వాళ్లతో. అంతే! తిరిగి ఇంటికి వచ్చేసరికి పెద్ద దుమారం!

'ఇవాళేకదా వాళ్ళతో పరిచయమైంది. సిగ్గు లేకుండా వాళ్ళ ముందలా తెగవాగడాని కర్థం వుండొంద్దూ? ఆవిడ చూడు - ఎంత అణకువగా, ముచ్చటగా ఎలావుందో! అక్కడున్నంతసేపూ నీ ప్రవర్తనకి సిగ్గుపడి చచ్చిపోయాను.మళ్ళీ ఎవరితోనైనా ఇలా ప్రవర్తించావంటే బావుం డదు - ముఖ్యంగా మొగాళ్ళ ముందు....' ఇష్టంవచ్చినట్లు దులిపేసాడు రాజారావ్. ఆపూట అన్నంకూడా తినకుండా బాధపడింది.

వాళ్ళముందు కాస్త మితంగా మాట్లాడలేకపోతే మళ్లీ లేనిపోని గోల....

ఇలా ఆలోచిస్తూనే రాబోయే అతిథుల కోసం టిఫిన్, కాఫీ సిద్ధం చేసేసరికి అరగంట పట్టింది. ఈ అరగంటలోనూ ఒకవేళ వాళ్లొచ్చే

సారేమోనన్న అనుమానంతో ఏ నాల్గైదుసార్లో హాల్లోకెళ్ళి తొంగి చూసొచ్చింది. ఆమె వంటింటి పని పూర్తి చేసుకుని హాల్లోకి రావడం, వాళ్ళు గుమ్మంలోకి అడుగు పెట్టడం ఒకేసారి జరిగింది.

''వాళ్ళొచ్చేసారండి....'' వాళ్ళని చూస్తూనే గబగబా భర్త దగ్గర కొచ్చి నెమ్మదిగా చెప్పింది శారద.

''రండి....రండి....'' చటుక్కున చేతిలో వున్న పుస్తకాన్నె దురుగా వున్న టీపాయ్ మీద పడేసి, లేచి వాళ్ళ నాహ్వానించాడు రాజారావ్.

''నా పేరు ఈశ్వర్. ఈమె నా భార్య - మయూరి. మీ ప్రక్క వాటాలో కివాళే అద్దెకి దిగాం....'' తమని పరిచయం చేసుకుంటూ అన్నాడతను.

"మీ మగవాళ్ల పరిచయా లిప్పుడవు తున్నాయిగాని, మా పరిచయా లెప్పుడో అయ్యాయ్!'' శారదవేపు చూసి చిన్నగా నవ్వుతూ అంది మయూరి.

జవాబుగా తనూ చిన్నగా నవ్వి లోపలి కెళ్లబోయింది శారద.

''ఏఁవండోయ్! మీరు కాఫీ, టిఫిన్లాంటి ప్రయత్నాలేమీ చెయ్యొద్దు. ఇప్పుడే ఆ కార్యక్రమాలన్నీ పూర్తి చేసుకుని వస్తున్నాం. కాసేపు మీరు కూడా వచ్చి ఇలా కూర్చున్నారంటే సరదాగా కబుర్లు చెప్పుకుందాం.'' సోఫాలో భర్త పక్కనే కూలబడుతూ చటుక్కునాగి శారదతో అంది మయూరి.

''అలాగేలెండి....'' ఆమె పిలుస్తున్నా కూడా వినిపించుకోకుండా లోపలికెళ్లిపోయింది శారద.

''మా పెళ్లై ముచ్చటగా మూడు నెలలైంది. ఈమె కాపురాని కొచ్చేమో ఇంకా నెలకూడా కాలేదు. అప్పుడే ఇది రెండో ఇల్లు!'' రాజా రావ్‌తో చెప్తూ మయూరి వేపు చూసి నవ్వాడీశ్వర్.

''ఇంతకు ముందు మీరొక్కరే కాబట్టి ఆ ఒంటి గదిలో వుండ గలిగేవారు. ఇద్దరికి ఆ రూమెలా సరిపోతుంది? అందుకే వెంటనే మరో ఇల్లు చూడమని చెప్పాను. తప్పేంటి?'' రాజారావునే సూటిగా ప్రశ్నిం చింది మయూరి.

''అబ్బే.... తప్పెందు కవుతుంది....?'' ఏమనాలో తెలీక గబు క్కుననేశాడు రాజారావ్.

''మరిప్పుడు చూడండి - ఇళ్లు మారడం నా హాబీ అయినట్లు మాట్లా డుతున్నారు!'' భర్తమీద ఫిర్యాదు చేసింది.

''ఇళ్లు మారడం కాదు నీ హాబీ- మొగుడితో పోట్లాడ్డం....''

''సర్లెండి-ఏదో ఒకటి! మనం ఇక్కడి కొచ్చింది వాళ్లతో పరి చయం చేసుకోడానిక్కాని, మన కీచులాటలు వాళ్లముందు ప్రదర్శించ డానిక్కాదు.''

ఇంతలో టిఫిన్ ప్లేట్ల 'ట్రే'తో హాల్లోకొచ్చింది శారద.

"ఏమిటండీ ఇదంతా! మేమొస్తున్నట్లు ముందే చెప్పడం తప్పయి పోయిందనుకుంటానే!" టిఫిన్ ప్లేట్లని వాళ్ళ ముందున్న టీపాయ్‌మీద సర్దుతున్న శారదని చూసి నొచ్చుకుంటూ అంది మయూరి.

''అబ్బే....ఏంలేదు....'' మొహమాటంగా జవాబిచ్చింది శారద.

''ఏం లేదంటారేమిటండీ - స్వీటు, హాటు రెండూ తీసుకొచ్చి మా ముందు పడేసి!" వచ్చినప్పట్నించీ ఎంతో సరదాగా అలా గలగలా మాట్లాడేస్తున్న మయూరిని చూస్తుంటే రాజారావ్‌కి ముచ్చటేస్తోంది.

"పర్లేదు తీసుకోండి...." అన్నాడామె వేపుచూసి నవ్వుతూ.

"మరి మీకు?" మూడు ప్లేట్లు తెచ్చి వాళ్ళ ముగ్గురి ముందూ సర్ది, తనెళ్ళి లోపలి గుమ్మం దగ్గర నిలబడ్డ శారద నాశ్చర్యంగా చూస్తూ అడిగాడీశ్వర్.

''తర్వాత తీసుకుంటాలెండి....'' సిగ్గుపడిపోయి జవాబిచ్చిందామె. ఆమె అణకువ, నమ్రత, మిత సంభాషణం - ఎంతో ఆకర్షించాయ్ ఈశ్వర్ని. తనకి తెలీకుండానే ఆమెని తన భార్యతో పోల్చుకోసాగాడు. ఇద్దరి మధ్యా వ్యత్యాసం!

''పోనీ....రండి.... ఇలా వచ్చి కూర్చోండి. అక్కడ నిలబడ్డారెందుకు?'' నవ్వింది మయూరి.

''పర్లేదులెండి....'' అక్కడ్నించి కదలకుండానే జవాబిచ్చింది శారద. మయూరి ఆశ్చర్యంతో ఒకసారి ఆమెని, రాజారావ్ని మార్చి చూసింది. రాజారావ్కి పరిస్థితి ఇబ్బందికరంగా తయారైంది. అతనికి శారద మీద విపరీతమైన కోపం వచ్చింది.

"రా శారదా! ఇలావచ్చికూర్చో.'' బలవంతాన కోపాన్నణచుకుంటూ అన్నాడు.

''మీరు మాట్లాడుతూండండి. ఇప్పుడే వస్తా...." అని లోపలి కెళ్ళిపోయింది శారద. ఆమె ప్రవర్తన మయూరికెంతో వింతగా వుంది. తమ ముందుకు రావడానికే ఆమె అంత సిగ్గెందుకు పడుతోందో అర్థం కాలేదు. ఒకవేళ తనందాన్ని చూసి ఈశ్వర్ వెనకబడతాడని భయమా? లేకపోతే రాజారావ్కి అనుమానం జబ్బుందా?....

మౌనంగా టిఫిన్ తినసాగింది.

-టిఫిన్ తినగానే కాఫీలు తెచ్చి యిచ్చి మళ్ళా లోపలిగుమ్మం గడప దగ్గరకెళ్ళి నిలబడింది శారద.

''అన్నట్లు రేపు రాత్రికి మా ఇంట్లోనే మీ ఇద్దరి భోజనం." హఠాత్తుగా అంది మయూరి.

"ఎందుకూ?" ఆశ్చర్యంగా అడిగాడు రాజారావ్.

"రేపు నా బర్త్‌డే...." సిగ్గుపడిపోతూ అందామె.

''భారీ ఎత్తునేర్పాట్లు చేసాం కార్యక్రమాల్ని'' గట్టిగా నవ్వుతూ అన్నాడీశ్వర్.

''భోజనం కాకుండా ఇంకా ఏమైనా కార్యక్రమాలున్నాయా?" అడిగాడు రాజారావ్.

''భోజనాలు కాగానే కాసేపు కబుర్లు. తర్వాత సినిమా. సినిమా కూడా వస్తున్నారు మీరు మాతో!'' ఖచ్చితంగా అంది మయూరి.

అంత తొందర్లోనే అంతగా కలిసిపోయే మయూరి మనస్తత్వానికి ముగ్ధుడైపోయాడు రాజారావ్. ఆమె హుషారుని చూస్తుంటే అతనిలో కొత్త హుషారు పుట్టుకొస్తోంది.

''భోజనానికైతే ఫర్లేదుకాని సినిమా అంటే మా హోండిపార్ట్‌మెంట్ పర్మిషన్ ముందు తీసుకోవాలి మీరు.'' శారదవైపు తిరిగి నవ్వుతూ అన్నాడు రాజారావ్.

''ఏం? మీకు సినిమాలు చూట్టం ఇష్టం లేదా?'' శారద నడిగింది మయూరి.

''పెద్దగా ఇష్టం లేదండి...." సిగ్గు పడిపోతూనే నెమ్మదిగా జవాబిచ్చింది శారద.

"ఇష్టముండి మాత్రం లాభమేంటి లెండి? మన ఆడవాళ్ళకి స్వాతంత్ర్య మెక్కడుంది గనక! మగవాళ్ళ అభిరుచుల్ని బట్టి మారాల్సిందేగా! నా మట్టుకు నన్ను చూడండి, నాకు సినిమాలు చూట్టమంటే ఎంతో

ఇష్టం. మా వారికి సినిమాలంతగా గిట్టవ్ అంతే! పెళ్ళయిన తర్వాత నేను కూడా సినిమాలు చూట్టం తగ్గిపోయింది." ఈశ్వర్ వేపు చూసి నవ్వింది.

''సరిపోయింది, మళ్ళీ ప్రారంభించావ్ నామీద దండయాత్ర?''

''మరేం భయపడవాకండి. ఇప్పుడు నాకంత ఓపిక లేదు. ఇందాక మేం చెప్పిన ప్రోగ్రామ్‌ని ఫిక్స్ చేశామండి. మీరిద్దరూ కాదనడానికి వీల్లేదు. మరి మళ్ళీ రేపొస్తాం. ఇంకా ఇంట్లో ఎక్కడిసామాను అక్కడే వుంది. సర్దుకోవాలి. వస్తాం.'' లేచి నిలబడింది మయూరి.

"అలాగే! రేపు రాత్రికి మేం మీ అతిథులం. మీరేరకంగా మర్యాదలు చేసినా స్వీకరించ గలవారం.'' నవ్వుతూ అన్నాడు రాజారావ్.

"థాంక్ యూ ..." మయూరి, ఈశ్వర్ వాళ్ళ వాటాలోకి వెళ్ళిపోయారు.

"నీకు మరీ మంచీ మర్యాద తెలీకుండా పోతున్నాయ్." వాళ్ళు వెళ్ళగానే భార్యవేపు కోపంగా చూస్తూ అన్నాడు రాజారావ్.

''నేనేం చేసేనండీ?'' అతని కోపం అర్థంకాక ఆశ్చర్యంగా అడిగింది శారద.

''ఏం చేశావా? ఇంటి కెవరైనా వస్తే వాళ్ళతో కాస్త సరదాగా మాట్లాటం కూడా తెలీదా? సిగ్గులొలకపోస్తూ పోయి అక్కడెక్కడో నిలబడతావేం. నేనేదో నిన్ను గిరిగీసి నిలబెట్టినట్లు! ఛీ ఛీ-చదువుకుంటే సరిపోదు, సంస్కార ముండాలి. ఆమెతో నిన్ను పోల్చి చూసుకుంటూ సిగ్గుతో చచ్చిపోయాను....'' అతని మాటలకి కోపం రాలేదు, నవ్వొచ్చింది శారదకి

“ఆ రోజున సరదాగా మాట్లాడితే తప్పు అన్నారు. ఈ రోజున కాస్త ముభావంగా వుంటే మిమ్మల్నేదో అవమానపరిచినట్లు మాట్లాడుతున్నారు! ఎలా ప్రవర్తించినా తప్పే. ఏం మగాళ్ళో!” మారు మాట్లాడకుండా టిఫిన్ తిన్న ప్లేట్లు, గ్లాసులు పుచ్చుకొని పెరట్లోకి వెళ్ళిందల్లా ప్రక్క వాటాలోంచి ఈశ్వర్ మాటలు వినబడుతుంటే నిలబడిపోయింది.

“ఇవాళేకదా వాళ్ళతో పరిచయమైంది? సిగ్గూ ఎగ్గూ లేకుండా వాళ్ళతో అంతగా వాగేయడాన్కి అర్థముండద్దూ? చూడు, ఎంత అణకువగా ఎలా వుందో ఆవిడ! అక్కడున్నంతసేపూ నీ ప్రవర్తనకి సిగ్గుతో చచ్చాను. మళ్ళీ ఎవరి దగ్గరైనా ఇలా ప్రవర్తించావంటే బావుండదు. ముఖ్యంగా మొగవాళ్ళ ముందు....”

‘హుఁ.... వీళ్ళదెంతో ముచ్చటైన దాంపత్యమనుకున్నాను. వీళ్ళ దాంపత్యంలోకూడా ఈ వింతరోగం పట్టిందన్నమాట!’ చిన్నగా నిట్టూర్చి తన పన్లో మునిగిపోయింది శారద.